## క్లుప్తంగా

### విద్యాకానుక కిట్ల పంపిణీ


ఆచంట వేమవరంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

**పెనుగొండ:** మండలంలోని ఆచంట వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లును ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి పంపిణీ చేశారు. శనివారం పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల, తల్లిదండ్రులపై గౌరవంగా ఉంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంపీపీ సూర్యకుమారి అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### వెంకన్న ఆలయంలో అన్నసమారాధన


ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

**నరసాపురం రూరల్:** మండలంలోని వేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల సహకారంతో అఖండ అన్న సమారాధనను నిర్వహించారు. ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. కోరిన కోర్కెలు తీర్చే కోనేటి రాయలవాడిగా ప్రసిద్ధికెక్కడంతో సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఈ అన్న సమారాధనలో సుమారు వెయ్యిమందికి స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### వైభవంగా ఆంజనేయ ఆలయ వార్షికోత్సవాలు


సుంకరపాలెంలో ఏకాహ భజన నిర్వహిస్తున్న దృశ్యం

**యలమంచిలి:** మండలంలోని గుంపర్రు పంచాయతీ సుంకరపాలెంలో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక, సుబ్రహ్మణ్య ప్రయుక్త శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం వద్ద ఉన్న ధ్వజ స్థంభానికి ఇత్తడి కవచం తొడుగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ డీవైఈఓ కొంపెల్ల వెంకట సూర్య సత్యనారాయణమూర్తి సహకారంతో ఈ ఇత్తడి కవచం తొడుగుతున్నట్లు తెలిపారు. మూడు రోజుల ఉత్సవాలలో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ఏకాహ భజన నిర్వహించారు. ఆదివారం సాయంత్రం స్వామి వారి పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తామని, రాత్రి అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ సభ్యులు వివరించారు. పూజా కార్యక్రమాలన్నీ ఆలయ అర్చకులు వేదాంతం సుబ్రహ్మణ్యం బ్రహ్మత్వంలో మానేపల్లి సత్యనారాయణ (చిన్నబాబు) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

### కొండెక్కిన కూరగాయల ధరలు

**పాలకొల్లు అర్బన్:** కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా ఉన్నాయని సీపీఎం డివిజన్ కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాయగూరలు కిలో రూ.100కు చేరువుగా ఉన్నాయన్ని, ఉల్లి ధర వింటే ఉలిక్కిపడేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కిరాణా, నిత్యావసర సరుకులు, కాయగూరల ధరలు కూడా పెరగడంతో సామాన్యులు విలవిలలాడిపోతున్నారని వివరించారు. ప్రభుత్వం తక్షణం కూరగాయలను సబ్సిడీపై అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

### వైభవంగా చండీహోమం

**భీమవరం(ప్రకాశం చౌక్):** పౌర్ణమి సందర్భంగా భీమవరం శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో వైభవంగా చండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జునశర్మ, వేదపండితులు హోమం జరిపించగా 87 మంది దంపతులు పాల్గొన్నారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ పాల్గొన్నారు.

**శ్రీబాలత్రిపుర సుందరీ దేవి ఆలయంలో...**

పౌర్ణమిని పురస్కరించుకుని భీమవరం మెంటేవారితోటలోని శ్రీబాలత్రిపుర సుందరీ దేవి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

# శిథిలావస్థలో నక్కల డ్రెయిన్ వంతెన

**పోడూరు:** వద్దిపర్రు గ్రామంలో నక్కల మేజర్ డ్రెయిన్‌పై ఉన్న వంతెన శిథిలావస్థలో ఉంది. ఈ వంతెన నిర్మించి దాదాపు 50 ఏళ్లు వుతుంది. వద్దిపర్రు గ్రామానికి ప్రతీఏటా వర్షాకాలంలో వరదతాకిడి ఉంటుంది. వర్షాకాలంలో నక్కల డ్రెయిన్ ఉగ్రరూపం దాల్చడంతో కాలువలో వరద నీరు వంతెనను తాకుతూ ప్రవహిస్తుంటుంది. దీంతో గత ఏడేళ్లుగా ఈ వంతెన శిధిలావసస్థకు చేరుకుంది. పిల్లర్లు కూడా దెబ్బతిన్నాయి. వంతెన బలహీనంగా ఉండడంతో ఆర్అండ్‌బీ అధికారులు భారీలోడుతో వెళ్లేవాహనాలు వంతెన మీదుగా వెళ్లవద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వద్దిపర్రు గ్రామానికి ప్రధాన ద్వారాంగా ఈ వంతెన ఉంటుంది. ఈ వంతెన మీదుగా నిత్యం కొబ్బరిలోడు లారీలు, ఇసుక లారీలు, స్కూల్ బస్సులు, ధాన్యం ట్రాక్టర్లు తిరుగుతుంటాయి. వంతెన బలహీనంగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు, వాహనదారులు భయపడుతున్నారు.

**హామీలిచ్చినా ఫలితం శూన్యం...**

వద్దిపర్రు గ్రామానికి దాదాపు ప్రతీఏటా వరద ముంపు ఉంటుంది. వరద ముంపుతో గ్రామంలో వరిచేలు, అక్కడక్కడా నివాసాలు నీట మునుగుతూ ఉంటాయి. రహదారిపై రెండు, మూడడుగుల ఎత్తులో లోతులో వరదనీరు ప్రవహిస్తుంది. నక్కలడ్రెయిన్‌పై కాస్త ఎత్తులో కొత్త వంతెనను నిర్మించి, రహదారిని కూడా కొంతమేర ఎత్తు పెంచితే గ్రామానికి వరద ముంపు బెడద చాలా వరకు తగ్గుతుందని గ్రామస్తులు ఎప్పటి నుంచో విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు స్పందించి కొత్తవంతెన నిర్మాణానికి, రహదారి ఎత్తు పెంచి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


వద్దిపర్రులో నక్కల మేజర్ డ్రెయిన్‌పై బలహీనంగా ఉన్న వంతెన


వద్దిపర్రులో నక్కలడ్రెయిన్ వంతెన వద్ద భారీ వాహనాలు వెళ్లకూడదని అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

### ప్రతిఏటా ఎదురుచూస్తున్నాం



ఈసారైనా వంతెన నిర్మిస్తారనీ, రహదారి అభివృద్ధి చేస్తారని ప్రతి ఏడాది ఎదురుచూస్తున్నాం. వరద వస్తే గ్రామంలో పంట చేలన్నీ నీటమునిగిపోతున్నాయి. కాస్త ఎత్తులో కొత్తవంతెన నిర్మించి రహదారి ఎత్తు పెంచి అభివృద్ధి చేస్తే వరద ముంపు సమస్య చాలావరకు తగ్గుతుంది. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి వరద ముంపును శాశ్వతంగా అరికట్టేలా చర్యలు చేపట్టాలి.

– మామిడిశెట్టి భద్రయ్య, గ్రామస్తుడు,

### వంతెన చాలా ప్రమాదకరంగా ఉంది



ప్రతి ఏటా వరదలు రావడం వల్ల నక్కలడ్రెయిన్‌పై వంతెన దెబ్బతిని బలహీనంగా మారింది. ఈ మార్గంలో నిత్యం అనేకవాహనాలు తిరుగుతుంటాయి. అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా భారీలోడులతో లారీలు ఈ మార్గంలో వెళుతున్నాయి. మరోవైపు స్కూల్ బస్‌లు కూడా తిరుగుతున్నాయి. ఇప్పుడు వర్షాకాలంలో మళ్లీవరద వస్తుంది ప్రమాదాలు జరిగి భారీ మూల్యం చెల్లించుకోక ముందే కొత్తవంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– చోడగిరి పెద్దిరాజు, గ్రామస్తుడు

### ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు


వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులు

**పాలకొల్లు అర్బన్:** వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు ఆదేశాల మేరకు పట్టణంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఏడుగురికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించినట్లు ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు తెలిపారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహారావు చేతుల మీదుగా రోగులకు కళ్ల జోళ్లు ఉచితంగా అందజేశామన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకట్రామరాజుకి రోగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## క్షీరారామలింగేశ్వరుని సన్నిధిలో మట్టితో శివ లింగాల తయారీ

**పాలకొల్లు సెంట్రల్:** పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మహిళలు మట్టితో శివలింగాలను తయారు చేస్తున్నారు. వచ్చే కార్తీక మాసంలో శ్రీశైలంలో శ్రీ భ్రమరాంభికా మల్లికార్జునస్వామికి కోటి శివలింగాలతో అభిషేకం చేయాలని పెనుగొండకు చెందిన ఓ భక్తుడు మొక్కుకున్నట్లు మహిళలు తెలిపారు. ఈ సందర్భంగా శివలింగాలు తయారు చేయడంలో తాము భాగస్వాములు అవుతామని కోరడంతో సుమారు 70 డెమోలను అందించారన్నారు. నెల రోజులుగా ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ క్షీరారామలింగేశ్వరస్వామి సన్నిధిలో సుమారు 40 మంది మహిళలు పాల్గొని శివలింగాలు తయారు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ దాదాపుగా 25 వేలు లింగాలను తయారు చేసినట్లు తెలిపారు. కనీసం ఓ లక్ష లింగాలైనా తయారు చేసి వారికి అందివ్వాలని అనుకుంటున్నామన్నారు. స్వామి వారికి అబిషేకం చేసిన అనంతరం ఆ శివలింగాలను నిమజ్జనం చేస్తారన్నారు. పట్టణంలో స్వామివారి సన్నిధితో పాటు రైల్వేగేటు సెంటర్ గరువు వద్ద కొలువై ఉన్న శంభేశ్వరస్వామి ఆలయం వద్ద కూడా భక్తులు లింగాలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. తయారు చేసిన లింగాలను చీరలు పెట్టుకునే బాక్సుల్లో భద్రపరుస్తున్నామన్నారు.


తయారు చేసిన శివలింగాలతో మహిళలు

### వేగంగా ఉపాధి పనులు

**మొగల్తూరు:** మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మచెరువు తదితర ప్రాంతాలతో పాటు మండలంలోని కేపీ పాలెం నార్త్, సౌత పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లో పంటబోదె పనులు చురుగ్గా జరుగుతున్నాయి. శనివారం కేపీ పాలెం సౌత్‌లో చేపట్టిన పనులను జేఈ ఆనంద్, టీఏ వెంకటేశ్వరరావు పరిశీలించి తవ్వకం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కూలీలకు సూచించారు.

### 24న మిగులు సీట్ల భర్తీ రాతపరీక్ష

**పెనుగొండ:** ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని పెనుగొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మిగులు సీట్ల కోసం ఈ నెల 24న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.ఎస్తేర్ క్వీనీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. 2024–25 సంవత్సరానికి గానూ పాఠశాలలో ఆరో తరగతికి 41 సీట్లు, 7వ తరగతికి మూడు సీట్లు, 8వ తరగతికి మూడు సీట్లు, 9వ తరగతికి ఐదు సీట్లు మిగిలి ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు పాఠశాలలో జరిగే పరీక్షకు హాజరు కావాలని కోరారు. మిగిలిన వివరాలకు 95504 02822కు ఫోన్ చేయాలని సూచించారు.

### విద్యార్థులకు వాసవి క్లబ్ వితరణ


విద్యార్థులకు విద్యాసామగ్రి పంచుతున్న వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు

**నరసాపురం రూరల్:** విద్యావ్యాప్తికి ప్రభుత్వం చేస్తున్న సహకారానికి తోడు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి సేవలను అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. శనివారం నరసాపురం మండలంలోని వేములదీవి గొందిమూల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్ బాబు, రీజియన్ చైర్మన్ చెక్కా శ్రీనివాసరావు తదితరుల చేతులమీదుగా విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. తొలుత పాఠశాల ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు ఉప్పుగంటి రాజశ్రీ వాసవి క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కార్మూరి శ్రీరాములు, శ్రీనివాసరావు, జూలూరి నవీన్, కనగళ్లబాబు, చుండూరి నాగబాబు, అప్పన బదరి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆకుమడులు వేసుకోవాలి

**మొగల్తూరు:** రైతులు ఆకుమడులు వేసుకునేందుకు సిద్ధం కావాలని, ముందుగా తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని వ్యవసాయాధికారి అబ్దుల్‌రహీమ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పొడి విత్తనాలకు అయితే 1 కేజీ విత్తనాలకు 3 గ్రాముల కార్బోడిజంను, తడి విత్తనాలకు అయితే 4 గ్రాముల కార్బొడిజంను కలిపి విత్తన శుద్ధి చేయాలని పేర్కొన్నారు. మండంలోని 17 గ్రామాలకు సంబంధించి 980 ఎకరాల్లో సార్వా సాగు చేపడతారని అంచనా వేస్తున్నామని వివరించారు. రైతులు ఎంటీయూ స్వర్ణ 7029, 1061ఇంద్ర, 1064 అమర, 1262 మార్టేరు మసూరి, ఎంటీయూ 1318 శీతాకాలం సన్నాలు వినియోగించాలని సూచించారు. లోతట్టు పంటచేలకు 1100 బాడవ మసూరి, ఎంటీయూ 1140 భీమా, ఎంటీయూ 1064 అమర,ఎంటీయూ 1172,ఎంటీయూ 1318 వంటివి అనుకూలంగా ఉంటాయని పేర్కొన్నారు.


మొగల్తూరులో దుక్కుదున్నేందుకు సిద్ధమైన చేను

## సామాజిక సేవకులకు హరివిల్లు సత్కారం

**పాలకొల్లు సెంట్రల్:** సామాజికంగా సేవా కార్యక్రమాలు చేయడం కూడా ఒక అదృష్టంగానే భావించాలని ఆ అవకాశం అందరికీ రాదని హరివిల్లు అధ్యక్షుడు వంగా నరసింహారావు అన్నారు. శుక్రవారం రాత్రి హరివిల్లు ఆధ్వర్యంలో సామాజిక సేవలకు సత్కారం కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకులు బుద్ధాల వెంకట రామారావు, కైండ్‌నెస్ సంస్థ చైర్మన్ గట్టిం మాణిక్యాలరావులను సన్మానించారు. వంగా నరసింహారావు మాట్లాడుతూ బీవీఆర్ కళాకేంద్రం స్థాపించి ఎంతో కళాకారులకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తూన్న రామారావు, కైండ్‌నెస్ సంస్థ చైర్మన్‌గా అనివార్య కారణాలతో మృతి చెందిన వారిని స్వదేశానికి తీసుకురావడానికి కృషి చేస్తున్న మాణిక్యాలరావులను సన్మానించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హరివిల్లు సభ్యులు యర్రంశెట్టి వెంకటరత్నం, గోపాలకృష్ణ, గుండా రామకృష్ణ, కర్నేని రోజారమణి, గుడాల హరిబాబు, మండెల భాస్కరరావు, చేగొండి రంగారావు తదితరులు పాల్గొన్నారు.


బుద్ధాల రామారావును సన్మానిస్తున్న హరివిల్లు సభ్యులు



## పోటీతత్వంతో చదివితేనే మంచి ఫలితాలు

**పోడూరు:** విద్యార్థులు పోటీతత్వంతో చదివితేనే పరీక్షల్లో మంచిఫలితాలు సాధిస్తారని జిన్నూరు సర్పంచ్ జమ్ము బేబీ మహలక్ష్మి అన్నారు. జమ్ము నిఖిలేష్ జయంతి సందర్భంగా జిన్నూరు జెడ్పీహైస్కూల్లో గతేడాది 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు జమ్ము నిఖిలేష్ మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా నగదుఅవార్డులను అందజేశారు. హెచ్ఎం సీహెచ్.శివజ్యోతి అధ్యక్షతన జరిగిన సభలో గతేడాది 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమస్థానం సాధించిన దొంగ హారికకు రూ.10 వేలు, ద్వితీయస్థానం సాధించిన దొమ్మేటి లీలామణికంఠకు రూ.7,500, తృతీయస్థానం సాధించిన కొప్పిశెట్టి షణ్ముక శ్రీప్రియకు రూ.5 వేలు నగదు బహుమతులు అందజేశారు. సభలో నిఖిలేష్ తల్లిదండ్రులైన సర్పంచ్ బేబీ మహలక్ష్మి, జమ్ము మృత్యుంజయరావు దంపతులు మాట్లాడుతూ చదువుతోనే విద్యార్థులు ఉన్నతభవిష్యత్తును అందుకోగలరన్నారు. హెచ్ఎం శివజ్యోతి మాట్లాడుతూ జమ్ము నిఖిలేష్ జ్ఞాపకార్థంగా తల్లిదండ్రులు ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రతిఏటా ప్రతిభా అవార్డులు, నగదు ప్రోత్సాహకాలు అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ నాటక రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం, నాయకులు మీసాల దానవెంకట నర్సింహులు, రెడ్డి ఆనంద్, చినబాబు, నిఖేలేష్ స్నేహితులు పాల్గొన్నారు.


జిన్నూరు జెడ్పీ హైస్కూల్లో నగదు బహుమతులు అందిస్తున్న దృశ్యం

### అధ్యయనంతో ఎంతో ప్రయోజనం

**భీమవరం:** ఇంజనీరింగ్ విద్యార్థులు కళాశాల వర్క్‌షాప్‌లలో అధ్యయనం చేసిన అంశాలు వాస్తవ రూపంలోకి తీసుకురాగలిగితే మంచి ఫలితాలు వస్తాయని తమిళనాడులోని త్యాగరాజర్ ఇంజనీరింగ్ కళాశాల ఆర్అండ్‌డీ డీన్ ఎస్.భాస్కర్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన ఎఫెక్టివ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్ వర్క్‌షాప్ శనివారం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాటాడుతూ వర్క్‌షాప్‌లో అధ్యాపకులు పూర్తిస్థాయిలో పాల్గొనడం వల్ల భవిష్యత్తులో కళాశాలలో మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల సిబ్బంది భాస్కర్‌ను సత్కరించారు.

### సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.అనుపమ

**పాలకొల్లు అర్బన్:** సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎం.అనుపమ కోరారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అనుపమ మాట్లాడారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రతి రోజూ మంచినీటి పరీక్షలు నిర్వహించి క్లోరినేషన్ శాతం నమోదు చేయాలని కోరారు. అలాగే ప్రతి 15 రోజులకోసారి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచాలని, అలాగే తదుపరి శుభ్రపరిచే తేదీలను నమోదు చేయాలని సూచించారు. మంచినీటి పైపులైన్‌ల మరమ్మతులు, సంపులు, ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతులు చేయాలన్నారు. అలాగే వర్షాకాలంలో ఆయా గ్రామాల్లో మురుగునీటి గుంటలు లేకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు మాట్లాడుతూ కలుషితమైన నీటి ద్వారా వచ్చే వ్యాధులు పైనా, అలాగే దోమల ద్వారా వచ్చే వ్యాధులపైనా అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఆశ, ఏఎన్ఎంలు ఆయా హేబిటేషన్‌లలో పర్యటించి ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని కోరారు. ఈవోపీఆర్‌డీ కేఎం వైభవతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

### ఘర్షణపై కేసు నమోదు

**ఉండి:** పాతగొడవల నేపథ్యంలో గొడవ పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు. యండగండి శివారు రాయనివానిగూడెం ప్రాంతానికి చెందిన సాలా గణేష్, తంగెళ్ల వెంకటేశ్వరరావు అనే ఇద్దరు వ్యక్తుల మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గొడవ పడి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఇద్దరిపైనా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఘనంగా దేవల మహర్షి జయంతి

**పాలకొల్లు సెంట్రల్:** పట్టణంలోని వీవర్స్ కళ్యాణమండపంలో దేవాంగ కుల వంశ మూలపురుషుడు శ్రీ దేవల మహర్షి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక వీవర్స్ కాలనిలో వీవర్స్ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వట్టం గణేశ్వరరావు మాట్లాడుతూ సృష్టిలోనే మొదటి వస్త్రసూత్రదారి దేవల మహర్షి అని భావితరాలకు తెలియజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘ అసోసియేట్ ప్రెసిడెంట్ మానెం బసవరాజు, రొబ్బి భాస్కరరావు, అల్లాడ కుమారస్వామి, ఊటుకూరి భోగేశ్వరరావు, బాసిన సత్యనారాయణ, కూర్మా శివగణేష్ బాసిన గుణేశ్వరరావు, నక్కిన విజయలక్ష్మి, యర్రా శివాజి, బొండపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**నరసాపురంలో..**


పాలకొల్లు సెంట్రల్: జ్యోతిప్రజ్వలన చేస్తున్న దేవాంగ కుల సంఘ సభ్యులు


నరసాపురం: దేవల మహర్షి జయంతి వేడుక నిర్వహిస్తున్న దృశ్యం

**నరసాపురం:** దేవాంగ కుల మూల పురుషుడైన దేవల మహర్షి జయంతి వేడుకను శనివారం పట్టణంలోని 12వ వార్డులో దేవాంగ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బళ్ల రమేష్‌కుమార్, దేశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ జేష్టమాస పౌర్ణమి రోజున దేవాంగ కుల పురుషుడైన దేవల మహర్షి జయంతిని జరుపుకుంటామని చెప్పారు. వస్త్ర సృష్టికర్త దేవాంగ మహర్షి అని పురాణాలు చెపుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కనకం ప్రసాద్, ఒగ్గు సత్యనారాయణ, గోరు లింగరాజు, కొమ్మని రాజు పాల్గొన్నారు.